క్లుప్తంగా

## ఆలయ అభివృద్ధికి విరాళం


గ్రామస్తులకు నగదు అందిస్తున్న ఉమామహేశ్వరనాయుడు

**కళ్యాణదుర్గం:** శెట్టూరులో నూతనంగా నిర్మించిన ఆంజనేయస్వామి ఆలయ అభివృద్ధికి వైఎస్సార్‌సీపీ నేత మాదినేని ఉమా మహేశ్వర నాయుడు తన వంతుగా విరాళం అందజేశారు. ఆలయ విగ్రహ, ధ్వజ నాగప్రతిష్ఠ మహోత్సవానికి హాజరుకావాలని గ్రామ పెద్దలు బుధవారం ఉమామహేశ్వర నాయుడు క్యాంపు కార్యాలయానికి వెళ్లి ఆహ్వాన పత్రిక అందజేశారు. ఈ సందర్భంగా ఉమా మహేశ్వర నాయుడు ఆలయ అభివృద్ధికి రూ.80 వేల ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు సోమనాథ్‌రెడ్డి, కేశవరెడ్డి, ఆదిశేషు, వెంకటేశులు, రామాంజినేయులు, విరుపాక్షిరెడ్డి పాల్గొన్నారు.

## టెన్నికాయిట్ జిల్లా జట్టుకు కనుకూరు విద్యార్థులు


విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

**శెట్టూరు:** కనుకూరు ఉన్నత పాఠశాల విద్యార్థులు టెన్నికాయిట్ జిల్లా జట్టుకు 9 మంది ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయురాలు సుధ, పీడీ అమరాంజనేయులు తెలిపారు. బుధవారం జిల్లా జట్టుకు ఎంపికైన విద్యార్థులను పాఠశాలలో అభినందించారు. టెన్నికాయిట్ అండర్– 19 బాలుర విభాగంలో కార్తికేయ, అండర్– 17 బాలబాలికల విభాగంలో చిన్నికృష్ణ, స్పందన, అనుష్క, జోతిక, అండర్– 14 బాలబాలికల విభాగంలో మహిధర్, పూజ, జీవిత, అనూష ఎంపికయ్యారని హెచ్‌ఎం తెలిపారు. వీరు ఈ నెల 9, 10 తేదీల్లో ఏలూరులో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు.

## శుభకార్యం


నూతన వధూవరులను ఆశీర్వదిస్తున్న ఉమా మహేశ్వరనాయుడు

**కళ్యాణదుర్గం:** పట్టణంలోని శ్రీనివాస కళ్యాణ మండపంలో బుధవారం శెట్టూరు మండలం బచ్చేహళ్లి సర్పంచు ప్రకాష్ కుమారుడు అభిరామ్, పల్లవి వివాహం జరిగింది. వైఎస్సార్‌సీపీ నేత మాదినేని ఉమామహేశ్వరనాయుడు, జెడ్పీటీసీ మంజునాథ్, శెట్టూరు మండల కన్వీనర్ శివన్నయాదవ్, నాయకులు సోమనాథ్‌రెడ్డి, బొమ్మజ్జి రమేష్, హరినాథ్‌రెడ్డి, ఎంఎస్ రాయుడు, తిప్పేస్వామి, రాజశేఖర్‌రెడ్డి, కంబాల పల్లి శ్రీనివాసరెడ్డి, అనంతరెడ్డి, లాయర్ ఎర్రిస్వామి తదితరులు హాజరై వధూవరులను ఆశీర్వదించారు. కార్యక్రమంలో నాయకులు ప్రతాప్, గంగాధర్, భీమేష్, టైలర్ వన్నూరు స్వామి, సుధాకర్, ఆదిశేషు, సర్పంచులు వెంకటేశులు, ఈరన్న, ఎంపీటీసీ నరసింహులు, తలారి సత్తి పాల్గొన్నారు.

## మార్మోగిన ముత్యాలమ్మ నామస్మరణ


ముత్యాలమ్మ దేవత

**కూడేరు:** ముద్దలాపురంలో బుధవారం ముత్యాలమ్మ నామస్మరణ మార్మోగింది. నూతనంగా నిర్మించిన దేవాలయంలో వేద పండితుడు బెల్దోణ రామనాథ శాస్త్రి ఆధ్వర్యంలో ముత్యాలమ్మ విగ్రహ ప్రతిష్ఠ నిర్వహించారు.

## దాడి కేసులో నిందితుడి అరెస్టు

**కళ్యాణదుర్గం రూరల్:** దాడి కేసులో పోలీసులు నిందితుడిని అరెస్ట్ చేశారు. వివరాలు.. పాలవాయి గ్రామంలో సోమవారం రాత్రి సెల్ ఫోన్‌లో గేమ్స్ ఆడుతున్న వన్నూరస్వామి అనే యువకునిపై అదే గ్రామానికి చెందిన రవినేపల్లి రామాంజనేయులు పాత కక్షల నేపథ్యంలో కొడవలితో దాడి చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు రూరల్ పోలీసులు నిందితుడిని బుధవారం అరెస్టు చేసి రిమాండ్‌కు పంపారు.

# కర్షకులపై కనికరం కరువు

- రాయదుర్గం, కళ్యాణదుర్గం, ఉరవకొండ నియోజకవర్గాల్లో దుర్భిక్షం
- అధిక వర్షాల సాకుతో సర్కారు అన్యాయం
- విడపనకల్లు, కుందుర్పిలో అత్యల్ప వర్షపాతం


మురడి వద్ద అరకొరగా పండిన వేరుశనగ పంట చూపుతున్న మహిళా రైతు


రాయదుర్గం మండలం పల్లేపల్లి సమీపాన కుప్పగా పేర్చిన వేరుశనగ పంట

**రాయదుర్గం:** కర్ణాటక సరిహద్దునున్న రాయదుర్గం, కళ్యాణదుర్గం, ఉవరకొండ నియోజకవర్గాల్లో దుర్భిక్షం తాండవిస్తున్నా కూటమి ప్రభుత్వానికి పట్టడం లేదు. మూడు నియోజకవర్గాల్లో సాధారణ సాగు విస్తీర్ణం 4,72,346 హెక్టార్లు కాగా, ఈ ఏడాది ఖరీఫ్‌లో 3,29,540 హెక్టార్లలో వివిధ రకాల పంటలు సాగులోకి వచ్చాయి. అయితే సకాలంలో వర్షాలు కురవక కొన్నిచోట్ల పంటలు ఎండిపోయాయి. అధిక వర్షాలు, తుపాన్ల తాకిడికి మరికొన్ని చోట్ల దిగుబడులు దెబ్బతిన్నాయి. బెట్టను తట్టుకునే పొలాల్లో పెట్టుబడులు దక్కితే... సెకర నేలల్లో పంట తుడిచిపెట్టుకుపోయే పరిస్థితి కనిపిస్తోంది. కళ్లారా చూస్తే తప్ప ప్రభుత్వానికి కరువు కనిపించదు.

### పట్టించుకోని ప్రజాప్రతినిధులు

పై మూడు నియోజకవర్గాల్లో 15 మండలాలు ఉన్నాయి. ఇందులో ఒక్క మండలాన్ని కూడా కరువు జాబితాలో చేర్చలేదు. విడపనకల్లు, కుందుర్పిలో లోటు వర్షపాతం నమోదైనట్లు రికార్డుల్లో చూపినా జాబితాలో విస్మరించారు. రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ ప్రాతినిధ్యం వహిస్తున్న ఉరవకొండ నియోజకవర్గంలోనూ పరిస్థితి తీవ్రంగా ఉన్నా ఒక్క మండలాన్ని కూడా కరువు జాబితాలో చేర్చలేదు. రైతులను ఆదుకోవాలన్న ధ్యాస ప్రజాప్రతినిధుల్లో కనిపించకపోవడం గమనార్హం.

### నాడు ఉదారం.. నేడు కర్కశత్వం

గడిచిన వైఎస్సార్‌సీపీ హయాంలో నాలుగేళ్ల పాటు వర్షాలు సమృద్ధిగా కురిశాయి. 2023లో ఎల్‌నినో ప్రభావంతో దేశ వ్యాప్తంగా లోటు వర్షపాతం నమోదైంది. ఆ సమయంలో ఈ ప్రాంతంలోనూ వర్షాలు కురవక పంటలు ఎండిపోయాయి. అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సత్వరం రైతులను ఆదుకునే చర్యలు చేపట్టారు. 15 మండలాల్లో బొమ్మనహాళ్ మినహా 14 మండలాలను కరువు జాబితాలోకి చేర్చారు. రైతుల నుంచి విజ్ఞప్తులు రావడంతో బొమ్మనహాళ్ మండల రైతులను కూడా ఆదుకుంటామని జగన్ భరోసా ఇచ్చారు. ఆ మేరకు 1,53,991 మంది రైతులకు ఒక్క రైతు భరోసా పథకం ద్వారా రూ.957.64 కోట్లు, సున్నా వడ్డీ ద్వారా 98,108 మందికి రూ. 24.14 కోట్లు, ఉచిత పంటల బీమా కింద 3,75,915 మందికి రూ.577.88 కోట్లు, ఇన్‌పుట్ సబ్సిడీ ద్వారా 41,865 మంది రైతులకు రూ.56.12 కోట్లు అందించి ఆదుకున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చి ఐదు నెలలు కావస్తున్నా రైతులకు పిసరంత సాయం అందించలేదు. పైగా కరువు మండలాల ప్రకటనలో తీవ్ర అన్యాయం చేసిందని రైతులు మండిపడుతున్నారు. నాడు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రైతుల పట్ల ఉదారత ప్రదర్శిస్తే... ప్రస్తుత కూటమి ప్రభుత్వం కర్కశత్వం చూపుతోంది.

### కరువు జాబితాలో చేర్చాలి



అన్ని మండలాలనూ కరువు జాబితాలో చేర్చాలి. ఖరీఫ్ సీజన్లో వర్షాభావ పరిస్థితులు తలెత్తాయి. ప్రభుత్వం కళ్లుమూసుకుని కరువే లేదంటే ఎలా? కొన్నిచోట్ల పంటలు దారుణంగా దెబ్బతిన్నాయి. ఆదుకోకపోతే రైతులు అప్పుల ఊబిలోకి వెళతారు.

– తిరుపాల్, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, కళ్యాణదుర్గం

### అప్పులు ఎలా తీర్చాలో..?



రైతులకు ప్రధాన జీవనాధారమైన వేరుశనగ పంట ఈసారి అరకొర వర్షాలకు తుడిచి పెట్టుకుపోయింది. సాగు కోసం చేసిన అప్పులు ఎలా తీర్చాలో అర్థం కావడం లేదు. రైతులు తీవ్రంగా నష్టపోయినా కణేకల్లు మండలాన్ని కరువు మండలంగా ప్రకటించకపోవడం బాధాకరం.

– జయచంద్రారెడ్డి, రైతు సంఘం అధ్యక్షుడు, కణేకల్లు

### రైతులను ఆదుకోవాలి



డివిజన్‌లోని అన్ని మండలాలనూ కరువు జాబితాలో చేర్చాలి. జూలైలో 24 రోజుల పాటు వర్షం కురవలేదు. ఈ సమయంలో పంటలు దెబ్బతిన్నాయి. సెప్టెంబర్‌లోనూ కొన్నాళ్లు అలాంటి పరిస్థితే కనిపించింది. అప్పుడప్పుడు కురిసిన చిరుజల్లులకు కొన్నిచోట్ల పెట్టుబడి దక్కింది. మరికొన్నిచోట్ల అధిక వర్షాలు, తుపాన్ల ప్రభావంతో దెబ్బతిన్నాయి. అలాంటి చోట బాగున్నాయనుకుంటే పొరపాటే. ప్రభుత్వాలు ఏవైనా సరే రైతు సంక్షేమానికి పాటుపడాలి. ఆదుకునే చర్యలు చేపట్టాలి. కరువు మండలాల ప్రకటన కోసం రైతులు ఆశగా ఎదురుచూస్తున్నారు. విపక్షాలన్నీ డిమాండ్ చేస్తున్నాయి. కళ్లతెరిచి చూడాల్సి ఉంది.

– మెట్టు గోవిందరెడ్డి, మాజీ ఎమ్మెల్యే, రాయదుర్గం

## ‘పవన్ కళ్యాణ్.. నోరు అదుపులో పెట్టుకో’

**ఉరవకొండ:** దళిత వర్గానికి చెందిన హోం శాఖ మంత్రిపై అనుచిత వాఖ్యలు చేసిన డిప్యూటీ సీఎం పవన్ నోరు అదుపులో పెట్టుకోవాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాజు సూచించారు. బుధవారం స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథి గృహం వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి అనితపై డిప్యూటీ సీఎం పవన్ చేసిన వాఖ్యలను ఎమ్మార్పీఎస్ నేతలు తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాట్లాడుతూ.. పవన్ కళ్యాణ్ చేసిన వాఖ్యలు కూటమి ప్రభుత్వ డొల్లతనాన్ని బయటపెట్టిందన్నారు. కేవలం దళిత వర్గానికి చెందిన హోం మంత్రి అనితను అవమానించడమే టార్గెట్‌గా చేసుకున్నారని ఆరోపించారు. హోంశాఖను తనకే ఇచ్చి ఉంటే పరిస్థితి వేరేలా ఉంటుందని వాఖ్యానించడం సరికాదన్నారు. ఉపాధి హామీ సామాజిక తనిఖీల్లో లక్షలాది రూపాయల అవినీతి వెలుగుచూస్తోందని తెలిపారు. ముందు దాన్ని రికవరీ చేయించాలని డిమాండ్ చేశారు. పవన్‌కు నిజంగానే హోంశాఖ పనితీరు అధ్వానంగా ఉంటే కేబినెట్‌లో చర్చించుకోవాలని సూచించారు. అంతేకాని బహిరంగంగా దళిత మంత్రిని అవమానపరచడం దుర్మార్గమన్నారు. మరోసారి ఇలాంటి వాఖ్యలు చేస్తే ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ఉద్యమిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు రాయంపల్లి వెంకటేష్, వెలిగొండ ఓబన్న తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యలపై అధికారుల నిర్లక్ష్యం


మాట్లాడుతున్న ఎంపీపీ కంభం చంద్రశేఖర్‌రెడ్డి

**బ్రహ్మసముద్రం:** ప్రజా సమస్యలపై అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని ఎంపీపీ కంభం చంద్రశేఖరరెడ్డి అన్నారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వసభ సమావేశం నిర్వహించారు. ఎంపీపీ మాట్లాడుతూ మండలంలో దాదాపు 15 రోజుల నుంచి శ్రీరామరెడ్డి తాగునీటి పథకం నీటి సరఫరా నిలిపేశారని, దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. తమకు సమాచారం అందించకుండానే ఉలవలు పంపిణీ చేశారంటూ ఏఓ సరితపై సభ్యులు మండిపడ్డారు. పంచాయతీ, ఆలయ భూములు ఆక్రమణకు గురవుతున్నట్లు అధికారులకు తెలియజేసినా పట్టించుకోవడం లేదని వేపులపర్తి, సంతే కొండాపురం సర్పంచులు సభ దృష్టికితెచ్చారు. గ్రామసచివాలయాల్లో ప్రింటర్లు పని చేయకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని సభ్యులు తెలియజేశారు. తహసీల్దార్ సుమతి, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ నందకిశోర్, ఇన్‌చార్జ్ ఈఓఆర్డీ రంగనాయకులు , జెడ్పీటీసీ ప్రభావతి, వైస్ ఎంపీపీలు వెంకటేష్ నాయక్, సునందమ్మ, ఎంపీటీసీలు నాగలక్ష్మీ, సువర్ణమ్మ, వరలక్ష్మీ, బుసప్ప, నరసింహులు, తిప్పేస్వామి , సర్పంచ్‌లు శెట్టిగారి మంజునాథ, ఆదినారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మురుగు మళ్లింపునకు సహకరించండి


మాట్లాడుతున్న ఎంపీడీఓ పీడీ శ్రీనివాసులు

**కణేకల్లు:** మురుగు మళ్లింపునకు గ్రామస్తులు సహకరించాలని ఎంపీడీఓ పీడీ శ్రీనివాసులు, తహశీల్దార్ ఫణికుమార్ సూచించారు. హనకనహాళ్‌లో మురుగు నీరు గ్రామశివారులో ఉన్న బచ్చనకల్లేశ్వరస్వామి ఆలయ ఆవరణలోకి చేరుతుండడంతో తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నామని ఆలయకమిటీతో పాటు భక్తులు ‘స్పందన’లో ఫిర్యాదు చేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు బుధవారం తహసీల్దార్, ఎంపీడీఓ, ఈఓఆర్‌డీ చంద్రమౌళి, ఎస్‌ఐ నాగమధు గ్రామాన్ని సందర్శించి మురుగు కాలువను పరిశీలించారు. అనంతరం అధికారులు సచివాలయంలో గ్రామసభ నిర్వహించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ గ్రామంలో మురుగునీటి సమస్య పరిష్కారానికి అందరూ ఒక్క తాటిపైకి రావాలన్నారు. మురుగునీరు ఎక్కడకు పంపాలనే విషయంలో ఒక నిర్ణయానికి రావాలన్నారు. ఎస్‌ఐ మాట్లాడుతూ భక్తులకు ఇబ్బందులు లేకుండా మురుగునీటిని మళ్లించాల్సి ఉందన్నారు. ఈ సమస్యతో శాంతిభద్రతలకు విఘాతం కల్గించేలా నడుచుకోవద్దని సూచించారు. ఏకాభిప్రాయంతో సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని, ఇందుకు అందరూ సహకరించాలన్నారు.

## సస్యరక్షణ చర్యలతోనే మేలైన దిగుబడి


రైతులనుద్దేశించి మాట్లాడుతున్న డీడీఏ మద్దిలేటి

**కణేకల్లు:** వరిలో సస్యరక్షణ చర్యలు చేపడితే మేలైన దిగుబడి పొందవచ్చని డీఆర్‌సీ (డిస్ట్రిక్ రిసోర్స్ సెంటర్) డీడీఏ మద్దిలేటి పేర్కొన్నారు. మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో బుధవారం గ్రామీణ విత్తనోత్పత్తి పథకం కింద వరిసాగు చేసిన రైతులకు శిక్షణ కార్యక్రమం జరిగింది. డీడీఏ రైతులనుద్దేశించి మాట్లాడారు. వాతావరణంలో చోటుచేసుకొంటున్న మార్పులతో వరికి చీడపీడలు, తెగుళ్లు ఆశించే అవకాశముందని, రైతులు ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉంటూ సస్యరక్షణ చర్యలు చేపట్టాలన్నారు. డీఆర్‌సీ ఏడీఏ శైలజ మాట్లాడుతూ చాలామంది రైతులు విచ్చలవిడిగా మందులు కొట్టి పెట్టుబడి వ్యయం పెంచుకుంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. తెగుళ్ల, చీడపీడల సమస్య ఉంటే ఆర్‌ఎస్‌కే సిబ్బందిని సంప్రదించాలన్నారు.

## సంక్షిప్త సమాచారం

### కబడ్డీ పోటీలకు వందన ఎంపిక


వందన

**బొమ్మనహాళ్:** దర్గాహొన్నూరు ఉన్నత పాఠశాల 8వ తరగతి విద్యార్థిని వందన రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం రవిప్రసాద్, పీఈటీలు హలీమా, కృష్ణ తెలిపారు. వందనను ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు.

### రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలకు ఎంపిక


ఎంపికైన విద్యార్థితో హెచ్‌ఎం, ఉపాధ్యాయులు

**బొమ్మనహాళ్:** నరసాపురం జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన సాయి వికాస్ అనే విద్యార్థి రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు బాలాజీ, పీడీ అమర్‌నాథ్ తెలిపారు. సాయి వికాస్‌ను హెచ్‌ఎం, పీడీలతో పాటు పాఠశాల కమిటీ చైర్మన్ రమేష్, ఉపాధ్యాయులు అభినందించారు.

### 8న మండల సర్వసభ్య సమావేశం

**వజ్రకరూరు:** స్థానిక స్త్రీశక్తి భవనంలో ఈనెల 8న మండల ప్రజాపరిషత్తు సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీపీ రమావత్ దేవి, ఎంపీడీఓ రవిప్రసాద్ తదితరులు తెలిపారు.

### దుకాణాల్లో చోరీ

**విడపనకల్లు:** మండల కేంద్రంలో మంగళవారం రాత్రి వ్యాపార దుకాణాల్లో చోరీ జరిగింది. వి.కొత్తకోట గ్రామానికి వెళ్లే రహదారిలో ఉన్న అమృత, వరవినాయక, వెంకటేశ్వర ఫర్టిలైజర్స్ షాపుల్లోని షట్టర్లను గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. మూడు షాపుల్లో రూ.10 వేలు నగదు చోరీ చేసినట్లు పోలీసులు తెలిపారు. మరో జనరల్ స్టోర్‌లో రూ.2 వేల నగదు, సిగరెట్లు ప్యాకెట్లు ఎత్తుకెళ్లారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నారు.

### పంచాయతీ అభివృద్ధికి కృషి

**వజ్రకరూరు:** కొనకొండ్ల మేజర్ పంచాయతీ అభివృద్ధికి కృషి చేస్తామని సర్పంచ్ నంచర్ల ఇందిరమ్మ, ఎంపీటీసీలు పాపన్న, మునయ్య, ముద్దయ్య తదితరులు తెలిపారు. బుధవారం కొనకొండ్లలోని 1వ వార్డులో తాగునీటి పైపులైన్ ఏర్పాటు పనులకు భూమిపూజ చేశారు. ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి సహకారంతో పంచాయతీలో మౌలిక సదుపాయాలతో పాటు అభివృద్ధి పనులు చేయిస్తామన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ రామచంద్ర, ఎంపీటీసీలు పాపన్న, మునయ్య, ముద్దయ్య, వైఎస్సార్‌సీపీ నాయకుడు మునీంద్ర, పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

### క్రీడా సామగ్రి అందజేత


క్రీడా సామగ్రితో ఉపాధ్యాయులు

**కంబదూరు:** స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలకు పీడీ లలితమ్మ చొరవతో కళ్యాణదుర్గం హాకీ క్లబ్ అసోసియేషన్ ప్రెసిడెంట్ నాగరాజు(రాజు) బుధవారం హాకీ పరికరాలను ఉచితంగా అందజేశారు. 20 హాకీ స్టిక్స్, 20 బాల్స్, 10 మార్కర్స్, 10 కోన్స్ అందించారు. ఈ సందర్భంగా దాతకు ఉపాధ్యాయులు, విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు.

### రేషన్ పంపిణీ ఎప్పుడో?

**బొమ్మనహాళ్:** ఒకటో తేదీ నుంచే కార్డుదారులకు పంపిణీ జరగాల్సిన రేషన్ సరుకులు ఆరో తేదీ దాటినా అందలేదు. గ్రామంలో 463 రేషన్ కార్డులు ఉన్నాయి. 67.67 క్వింటాళ్ల బియ్యం, 4.45 క్వింటాళ్ల పంచదార పంపిణీ చేయాల్సి ఉంది. రెవెన్యూ అధికారులు స్పందించి పంపిణీ ప్రారంభించాలని కార్డుదారులు కోరుతున్నారు.

### పాడి ఆవుల పంపిణీ

**కుందుర్పి :** స్థానిక కుసుమగిరి రైతు ఉత్పత్తిదారుల సంఘం లిమిటెడ్ ఆధ్వర్యంలో బుధవారం 25 పాడి ఆవులను రైతులకు పంపిణీ చేసినట్లు సంఘం సీఈఓ నరసింహమూర్తి తెలిపారు. కార్యక్రమంలో సంఘం డైరెక్టర్లు లక్ష్మీపతి, సుదర్శన్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

### ట్రాక్టర్ అపహరణ

**కంబదూరు:** మండల కేంద్రానికి చెందిన మాజీ సర్పంచ్ శ్రీరాములు ట్రాక్టర్ అపహరణకు గురైంది. పోలీసులు అందించిన వివరాలు.. శ్రీరాములు మంగళవారం తన ట్రాక్టర్‌ను పొలంలో వదిలి ఇంటికెళ్లాడు. అర్ధరాత్రి ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు ట్రాక్టర్‌ను, పరికరాలను ఎత్తుకెళ్లారు. బుధవారం ఉదయం గమనించి బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఏఎస్‌ఐ ఓబుళపతి కేసు నమోదు చేసి అనుమానితులను అదుపులోకి తీసుకొని విచారణ చేపట్టారు.

## రోడ్డుపైకి మురుగు


15వ వార్డులో రోడ్డుపైనే మురుగు

**రాయదుర్గంటౌన్:** పట్టణంలోని 15వ వార్డు గ్యాస్ గోడౌన్ నుంచి ఇందిరమ్మ లేఅవుట్ వరకు కాలువలు నిండి మురుగునీరు రోడ్డుపై పారుతోంది. దీంతో ఇందిరమ్మ కాలనీతోపాటు ముత్తరాసి కాలనీకి వెళ్లే వాహనచోదకులు, పాదచారులు ఇబ్బంది పడుతున్నారు. అధికారులు స్పందించి రోడ్డును బాగుచేయాలని ప్రజలు కోరుతున్నారు.

## ఇండియా ఓబయ్య ఆశయాలను కొనసాగిద్దాం


ఓబయ్య విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

**కళ్యాణదుర్గం:** స్వాతంత్ర్య సమర యోధుడు, మాజీ ఎమ్మెల్సీ ఇండియా ఓబయ్య ఆశయాలను కొనసాగిద్దామని పలువురు పేర్కొన్నారు. 17వ వర్ధంతి కార్యక్రమంలో భాగంగా బుధవారం వైఎస్సార్‌సీపీ నాయకులు టీ సర్కిల్‌లో ఏర్పాటు చేసిన ఓబయ్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కళ్యాణదుర్గం ప్రాంతానికి ఆయన చేసిన సేవలను గుర్తుచేసుకున్నారు. కార్యక్రమంలో ఓబయ్య కుమారుడు ఐ. సుధీర్, కౌన్సిలర్లు లక్ష్మన్న, పరమేశ్వరప్ప, పట్టణ కన్వీనర్ గోపారం శ్రీనివాసులు, సీనియర్ నాయకుడు తిరుమల వెంకటేశులు, షేక్షావలి, ఇబ్రహీం, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మాల ఎర్రిస్వామి, ఉద్దీప్ సింహా, బోయ నాగరాజు, అల్తాఫ్ పాల్గొన్నారు.

## పోలీస్‌స్టేషన్ ఆకస్మిక తనిఖీ


పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేస్తున్న డీఎస్పీ రవి బాబు

**కుందుర్పి:** స్థానిక పోలీస్‌స్టేషన్‌ను కళ్యాణదుర్గం డీఎస్పీ రవిబాబు బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన స్టేషన్‌లోని అన్ని రికార్డులను పరిశీలించారు. క్రైమ్ రేట్‌ను తగ్గించడంతోపాటు జూదాలను నిర్మూలించడానికి చర్యలు తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో ఎస్‌ఐ నగేష్, సిబ్బంది పాల్గొన్నారు.

## ఎన్‌సీసీ సర్టిఫికెట్లతో ప్రయోజనాలు



మాట్లాడుతున్న క్యాంప్ కమాండర్ కల్నల్ శశికుమార్

**కూడేరు:** నేషనల్ క్యాడెట్ కార్ప్స్ (ఎన్‌సీసీ)లో శిక్షణ అనంతరం ఏ, బీ, సీ సర్టిఫికెట్లు పొందడం ద్వారా ప్రయోజనాలు పొందవచ్చని ఎన్‌సీసీ క్యాంప్ కమాండర్ కల్నల్ శశికుమార్ పేర్కొన్నారు. బుధవారం మండల పరిధిలోని బ్రాహ్మణపల్లి వద్ద ఉన్న ఎన్‌సీసీ నగర్‌లో సీఏటీసీ–10వ శిక్షణ తరగతులు ప్రారంభమయ్యాయి. నంద్యాల, పుట్టపర్తి, అనంతపురం, కర్నూలు జిల్లాలకు చెందిన 600 మంది క్యాడెట్లు హాజరయ్యారు. క్యాంప్ కమాండర్ మాట్లాడుతూ.. ఏ, బీ, సీ సర్టిఫికెట్ల ద్వారా ఉన్నత విద్య, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కల్పించే ఉద్యోగాల్లో రిజర్వేషన్ సదుపాయం ఉంటుందన్నారు. కాబట్టి 10 రోజుల పాటు సాగే ఈ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సర్టిఫికెట్లు పొంది ఉజ్వల భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలని తెలిపారు.

## టిప్పర్ ఢీ: వ్యక్తికి తీవ్ర గాయాలు

**విడపనకల్లు:** మండల పరిధిలోని పాల్తూరు–హావళిగి గ్రామాల మధ్య ఓ టిప్పర్ ద్విచక్ర వాహనంలో వెళ్తున్న వ్యక్తిని ఢీ కొట్టిన సంఘటన చోటు చేసుకుంది. వివరాలు ఇలా.. హావళిగి గ్రామానికి చెందిన నాగార్జున ద్విచక్ర వాహనంలో హావళిగి వెళ్తుండగా పాల్తూరు సమీపంలో హావళిగి వైపు నుంచి వస్తున్న టిప్పర్ ఢీ కొట్టింది. ఈ ఘటనలో నాగార్జున తీవ్రంగా గాయపడటంతో ఉరవకొండ ప్రభుత్వ హాస్పిటల్‌కు తరలించారు. పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు చెప్పడంతో మెరుగైన చికిత్స కోసం అనంతపురం ప్రభుత్వ హాస్పిటల్‌కు తరలించారు.

## దుర్గంధం...!


వాల్మీకి సర్కిల్ వద్ద ప్రధాన రహదారి పక్కన పేరుకుపోయిన చెత్త


డంపింగ్ యార్డును తలపిస్తున్న బళ్లారి మిట్ట ప్రాంతం


సరోజ కాంపౌండ్‌కు వెళ్లే ప్రధాన దారిలో చెత్తాచెదారం


రెవెన్యూ కాలనీ వీధిలో...


సాంఘిక సంక్షేమ శాఖ కార్యాలయం వద్ద ఇలా...

**కళ్యాణదుర్గం:** కళ్యాణదుర్గం ‘దుర్గంధం’గా మారింది. పట్టణంలోని పలు కాలనీలు చెత్తా చెదారంతో నిండిపోయి అపరిశుభ్రంగా మారాయి. సుమారు 100 మంది పారిశుద్ధ్య కార్మికులు అవసరం కాగా 61 మంది మాత్రమే పనిచేస్తున్నారు. చెత్త సేకరణకు 3 ట్రాక్టర్లు అవసరం ఉండగా కేవలం ఒకటి మాత్రమే అందుబాటులో ఉంది. ఈ క్రమంలో ఆయా వార్డుల్లో చెత్తచెదారంతో పాటు మురుగు పేరుకుపోయి వీధులన్నీ దుర్గంధం వెదజల్లుతున్నాయి. దీనికి తోడు ప్రధాన రోడ్డుకు ఆనుకుని చెత్తకుండీలు ఏర్పాటు చేయడంతో ప్రధాన దారులన్నీ చెత్తతో నిండిపోయాయి. రాత్రి సమయాల్లో దోమల బెడద అధికంగా ఉందని, చిన్నారులు జ్వరాల బారిన పడుతున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.